# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి: 14
సంచిక: 08
ఆగస్టు 2025
వెల: రూ. 5/-



గాజాలో అసువులు బాసిన కలం యోధులు



ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే దృశ్యాలు








































ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నిర్వహించిన డిమాండ్స్ డే దృశ్యాలు. 31వ పేజీలో మిగిలిన జిల్లాల చిత్రాలున్నాయి.

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

సంపుటి: 14 ఆగస్టు 2025 సంచిక: 8

## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| సిద్ధార్ధ వరదరాజన్, కరణ్‌థాపర్‌లపై అస్సాంలో కేసు ......... | 4 |
| అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు ............. | 5 |
| రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే ................ | 6 |
| నగరాభివృద్ధి ప్రతిబింబం ఫోటో ఎగ్జిబిషన్ ........................ | 12 |
| అక్రిడిటేషన్ నియమ నిబంధనలు ............ | 13 |
| వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జీవో జారీ ......................... | 14 |
| జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణకు చర్యలు ....................... | 16 |
| ఈపిఎఫ్ డెత్ రిలీఫ్ 15 లక్షలకు పెంపు .................... | 16 |
| అక్రిడిటేషన్ జీవోలో మార్పులు చేయాలి ---------------- | 17 |
| మూడేళ్లుగా విచారణ ఖైదీగా జర్నలిస్టు ..................... | 18 |
| గాజాపై ఇజ్రాయిల్ దాడిలో జర్నలిస్టులు మృతి ....... | 20 |
| ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ...... | 23 |



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

జి.ఆంజనేయులు, ఎస్.వెంకట్రావు
వి.నవీన్‌రాజ్, ఎమ్. శ్రీనివాస్
బి.ఎన్.ప్రసాదరావు, వి.గోపి
వి.రామారావు, ఆర్.రామాంజనేయులు
బి. ఈశ్వరరావు, కె.వేణుగోపాలరావు
టి.మద్దులేటి, వి.భక్తవత్సలం
ఒ.శాంతి, ఎస్.మురళీశంకర్
కె.ఎస్.శంకరరావు, జి. శీనుబాబు
డి.మధుసూదనరావు

డిజైనర్:

**PUBLISHED, PRINTED AND EDITED BY G. Anjaneyulu on behalf of Andhra Pradesh Working Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


## బలిపశువులవుతున్న జర్నలిస్టులు

మారిన పరిస్థితుల్లో జర్నలిస్టులు బలిపశువులవుతున్నారు. సమాచారం విస్తృతి ఎంతబాగా ఉంటే అంత మేలు జరుగుతుందని భావించే వ్యవస్థ స్వభావంలో మార్పు చోటు చేసుకుంటోంది. వ్యవస్థ నిర్వాహకులుగా ఉన్న రాజకీయ పక్షాలు, అధికార వర్గాలు సమాచారాన్ని కట్టడి చేసేందుకు ఎన్ని మార్గాలున్నాయో అన్నింటినీ వెతుకుతున్నాయి. పారదర్శకతను పాటిస్తామని చెప్పేవారు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సమాచారాన్ని అందించే మీడియాపై కట్టడి పెంచారు. ఐటి చట్టంతో కేసులు బనాయించడం, అక్రమ కేసులు, బెదిరింపులు, భయపెట్టడం, చంపేయడానికి కూడా వెనకాడ్డం లేదు. అంతర్జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఇదే ధోరణి. ఏ రాజకీయ పక్షం అధికారంలో ఉన్నా అనుసరిస్తున్న మార్గం మాత్రం ఒకటే. ఇజ్రాయిల్‌కు, పాలస్తీనాకు జరుగుతున్న పోరులో సామాన్య ప్రజలతో పాటు సమాచారం అందించే జర్నలిస్టులు బలవుతున్నారు. యుద్ధ నియమాలను, అంతర్జాతీయ నిబంధనలను పట్టించుకోవడం లేదు. గాజాలో ఇరవై రోజుల వ్యవధిలోనే ఇరవైమంది జర్నలిస్టులు రెండు ఆసుపత్రులపై జరిగిన దాడుల్లో హతమారిపోయారు. జాతీయస్థాయిలో రాజ్యాంగయంత్రం బనాయిస్తున్న కేసులకు లెక్కేలేదు. దేశద్రోహం నేరం మోపి సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్ధ వరదరాజన్, కరణ్ థాపర్, అభిసార్‌శర్మలపై అక్రమంగా కేసులు బనాయించారు. సుప్రీంకోర్టు జర్నలిస్టుల రక్షణకు వచ్చి వారిని అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేసినా పోలీసులు బేఖాతరు చేసి సమన్లు జారీ చేస్తున్నారు. పార్లమెంటు సభ్యులు ఈ కేసులు అక్రమం ఎత్తేయమని కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఆదోని పోలీస్‌స్టేషన్‌లో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయని వార్త రాస్తే ఆధారాలు చెప్పకుంటే కేసులు పెట్టాల్సి వస్తుందని ఆరు దినపత్రికల విలేకరులకు నోటీసులిచ్చారు. ఇసుక అక్రమ రవాణా, మట్టి అక్రమ రవాణాలు యధేచ్ఛగా సాగుతున్నాయని వార్తలు రాస్తే కొన్ని చోట్ల విలేకరులను పోలీస్‌స్టేషన్లకు పిలిపిస్తున్నారు. వచ్చిన వార్తలో నిజానిజాల నిగ్గు తేల్చాల్సిన పోలీసు వ్యవస్థ తమకు తెలిసిన సమాచారం ఆధారంగా వార్తలు రాస్తే విలేకరులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే అధికారిక మీడియా సమావేశాలకు తమకు అనుకూలంగా ఉన్నారనుకునే వారిని మినహా మిగిలినవారిని రానివ్వడం లేదు. పై నుంచి కింద వరకు ఇదే ధోరణి కొనసాగితే పరిపాలనలో పారదర్శకత సాధ్యపడదు. మీడియాలో పనిచేసే జర్నలిస్టులను భయభ్రాంతం చేయడం ద్వారా ఏది నిజమో ఏది కాదో తెలిసేందుకు తాత్కాలికంగా కొంత జాప్యం జరుగుతుందేమో కాని నివురు మాటున నిప్పును దాచలేరు. అది అందరికీ వెలుగిచ్చేందుకు వీలైన రీతిలో వ్యవహరించడం పాలకులకు శ్రేయస్కరం.

## సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌లపై

# అస్సాంలో దేశద్రోహం కేసు



ద వైర్ మీడియా సంస్థ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్, సీనియర్ జర్నలిస్టు కరణ్‌థాపర్‌లపై అస్సాంలో రాజద్రోహ నేరం కేసు నమోదయింది. భారతీయ న్యాయ సమితిలోని సెక్షన్ 152 కింద ఆ జర్నలిస్టులపై దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఇండోనేషియాకు భారతరక్షణ అనుబంధాధికారి కెప్టెన్ శివకుమార్ ఇచ్చిన వివరణ ఆధారంగా జూన్ 28న ది వైర్లో ప్రచురితమైన కథనంపై బిజెపి నాయకులు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ రూపొందించారు.

2025 జూలై 11న మోరీగావ్‌లో అసోం పోలీసులు సెక్షన్ 152 బి.ఎన్.ఎస్ లోని ఇతర నిబంధనల కింద దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ పై జర్నలిస్టులు వరదరాజన్ ది వైర్లోని జర్నలిస్టులందరికీ బలవంతపు చర్యల నుండి రక్షణ కల్పించాలని జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ జోమాల్యా బాగ్చీలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయినప్పటికీ ఈనెల 12న పోలీసులు సమన్లు జారీ చేయడం గమనార్హం.

ఇప్పుడు ఎటువంటి కారణం లేకుండానే అసోం పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వరదరాజన్, కరణ్‌థాపర్‌లను ఈ నెల 22న గౌహతిలోని క్రైమ్ బ్రాంచ్‌లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్టు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు, అని జర్నలిస్టు సంఘాలు పేర్కొన్నాయి. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్ కార్ప్స్ సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. తమ జర్నలిస్టులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం రెండు నెలల్లో రెండోసారి అని ద వైర్ సంస్థ పేర్కొంది.

గౌహతికి చెందిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ప్రతీకార చర్యగా జర్నలిస్టులపై కేసు పెట్టినట్లు జర్నలిస్టు సంఘాలు విమర్శించాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీ ఆ సమయంలో లేదు. ఎటువంటి నేరానికి పాల్పడ్డారో కూడా ఆ ఎఫ్ఐఆర్లో చెప్పలేదు. ఈ విషయమై గౌహతి జాయింట్ పోలీస్ కమిషనర్ ముందుగా తమకు ఎఫ్ఐఆర్ కాపీని అందజేయాలని తాము రాతపూర్వకంగా లేఖలో ఇన్‌స్పెక్టర్‌ను కోరినట్లు వరదరాజన్ చెప్పారు. చట్ట ప్రకారం దర్యాప్తునకు సహకరిస్తామని ఎఫ్ఐఆర్ కాపీని అందజేసినట్లయితే వర్చువల్‌గా లేదా ఢిల్లీలోనైనా తనను ప్రశ్నించవచ్చని ఆలేఖలో వరదరాజన్ పేర్కొన్నారు.

**పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడి**

సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన జర్నలిస్టులకు అస్సాం పోలీసులు సమన్లు పంపించడం పత్రిక స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం దాడి అని తక్షణమే వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించాలని 15 మంది పార్లమెంటు సభ్యులు డిమాండ్ చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 152ను దుర్వినియోగం చేస్తూ ది వైర్ సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్‌థాపర్, ఇతర జర్నలిస్టులపై పలు క్రిమినల్ కేసులు మోపుతూ అస్సాం పోలీసులు చేపట్టిన వేధింపు చర్యల పట్ల 15

## జర్నలిస్టు అభిసార్‌శర్మపై కేసు

అస్సాం కేంద్ర ప్రభుత్వాల పరిపాలనను వ్యంగ్యంగా విమర్శిస్తూ యూట్యూబ్ లో వీడియోలను అప్లోడ్ చేశారన్న ఆరోపణలపై పాత్రికేయుడు అభిశార్ శర్మ పై కేసు నమోదయింది. అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ విశ్వశర్మ మత రాజకీయాలను అనుసరిస్తున్నారని విమర్శిస్తూ ఆయన తన యూట్యూబ్ ఛానల్‌లో ఒక వీడియోను అప్‌లోడ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ ముస్లింల విభజనతోనే మనుగడ సాగిస్తున్నాయని ఆయన వీడియోలో వ్యాఖ్యానించారు. దేశద్రోహం ఆరోపణలపై నమోదైన కేసులకు సంబంధించి పాత్రికేయులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు గువాహాటి పోలీసులు సమన్లు జారీ చేయడానికి విపక్షాలు తీవ్రంగా ఖండించాయి.

మంది పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రకటనపై సంతకాలు చేసిన ఎంపీలు జాన్ బ్రిట్టాస్, ఎం ఏ రహీం, వీర్ సదాశివన్‌లతో పాటు జైరాం రమేష్, యాదవ్, దిగ్విజయ సింగ్, జయ బచ్చన్, రేణుక చౌదరి, ముకుల్ వాస్నిక్, శక్తి సింహ గోహిల్, సయ్యద్ నజీర్ హుస్సేన్, జావేద్ అలీ ఖాన్, ఆర్ గిరిరాజన్, అనిల్ కుమార్ యాదవ్‌లు ఉన్నారు.

**వరదరాజన్, కరణ్‌థాపర్‌లకు సుప్రీం రక్షణ**

దేశద్రోహం ఆరోపణలపై అస్సాం పోలీసులు నమోదు చేసిన కేసుకు సంబంధించి సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ వరదరాజన్ కరణ్‌థాపర్‌లను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాక్చి ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మోరెగాం పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో జర్నలిస్టులకు మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించినప్పటికీ గౌహతి పోలీసులు మరో కేసులో వారికి సమన్లు జారీ చేసి విచారణకు రావాలని ఆదేశించారని పిటిషనర్ తరపు న్యాయవాది నిత్యా రామకృష్ణన్ తెలిపారు. గతంలో సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను గౌహతి పోలీసులు ఉల్లంఘించారని ఆమె పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం వరదరాజన్ కరణ్‌థాపర్‌లపై కఠిన చర్యలు తీసుకోవద్దని గౌహతి పోలీసులను ఆదేశించింది. ప్రతి ఒక్కరూ చట్టాలను అనుసరించాలని తదుపరి విచారణలోపు జర్నలిస్టులు పోలీసుల దర్యాప్తులో పాల్గొని స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని సూచించింది.

**ఢిల్లీలో ర్యాలీ**

జర్నలిస్టులు కరణ్ థాపర్, అభిసార్ శర్మ, సిద్ధార్థ వరదరాజన్‌లపై అస్సాం పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఢిల్లీలో ఢిల్లీ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో అస్సాం భవన్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న జర్నలిస్టులు జర్నలిస్టులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

**ఎపిడబ్ల్యుజెఎఫ్ ఖండన**

ది వైర్ మీడియా సంస్థ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్, సీనియర్ జర్నలిస్ట్ కరణ్ కాపర్‌లపై అసోం పోలీసులు అక్రమ కేసులు బనాయించడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. వెంకట్రావు, జి. ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను విమర్శనాత్మకంగా ప్రజల ముందుంచే ది వైర్ పై ప్రభుత్వం అనేక విధాలుగా వేధింపులకు దిగుతోంది. గతంలో సిద్ధార్థ వరదరాజన్. ది వైర్ మీడియా సంస్థ జర్నలిస్టులపై పెట్టిన కేసుల అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో బిజెపి ప్రభుత్వం తన పార్టీ అధికారంలో ఉన్న అసోం పోలీసుల ద్వారా మీడియా సంస్థను నడుపుతున్న జర్నలిస్టులపై కేసులు నమోదు చేసింది. ఇండోనేషియాకు భారత రక్షణ అనుబంధ అధికారి కెప్టెన్ శివకుమార్ ఇచ్చిన వివరణ ఆధారంగా జూన్ 28న ది వైర్ లో ప్రచురితమైన కదనం పై బీజేపీ నేత దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ రూపొందించారు. గత జూలై 11న అసోం పోలీసులు సెక్షన్ 152 బిఎన్ఎస్ లోని ఇతర నిబంధనలు కింద దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ పై పలు జర్నలిస్టు సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. మీడియాపై కేంద్ర ప్రభుత్వం, బిజెపి సాగిస్తున్న ఈ వేధింపులను, దాడులను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోంది.

# అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల ఆగస్టు 30న ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు, 1 సెప్టెంబర్, 2025 నుండి 30 నవంబర్, 2025 వరకు లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్యాబినెట్ అక్రిడిటేషన్ల విధివిధానాలపై ఆమోదం తెలియజేసింది. ఈ మేరకు జీవో కూడా జారీ అయింది. వాటి అమలునకు మరికొంత సమయం తప్పనిసరి కావడంతో మరోసారి అక్రిడిటేషన్ల గడువును పొడిగించక తప్పని పరిస్థితి నెలకొన్నది. సెప్టెంబరు నెలలోనే అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ ఆరంభమవుతుందని భావిస్తున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే



ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 4 జర్నలిస్టుల డిమాండ్స్ డే విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో డిమాండ్స్ డే కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కొన్ని జిల్లాల్లో పర్యటనలో ఉన్న మంత్రులకు, శాసనసభ్యులకు వినతి పత్రాలు అందజేశారు. అన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం సమర్పించారు. వర్కింగ్ జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఆ వినతి పత్రంలో ప్రస్తావించారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు, పెన్షన్ చెల్లింపు, అక్రిడిటేషన్ల జారీకి వీలుగా కొత్త జీవో తీసుకురావడం, జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వం నియమించే కమిటీలలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించడం, మీడియాలోని ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు, మీడియాలో పనిచేసే జర్నలిస్టులకు వృత్తిపరమైన రక్షణతో పాటు ఉద్యోగ భద్రత, విధినిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి చట్టబద్ధమైన రక్షణ లభిస్తుందో విధినిర్వహణలో ఉండే జర్నలిస్టులకు అటువంటి రక్షణ కల్పించడం, జర్నలిస్టుల అవార్డులను ప్రధానం, రాష్ట్ర కేంద్రంలో వృద్ధ జర్నలిస్టుల కోసం ఓల్డ్ ఏజ్ హోం నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆ వినతి పత్రంలో కోరింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు 20 చోట్ల కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదు చోట్ల కార్యక్రమం నిర్వహించారు. అన్నిచోట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఇచ్చిన పిలుపును విజయవంతం చేసిన అన్ని జిల్లా శాఖలకు ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు ఆంజనేయులు అభినందనలు తెలియజేశారు.




### జర్నలిస్టుల డిమాండ్లు

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఆరోగ్యబీమా కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 11వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రం మొదలు రాజధాని వరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు జర్నలిస్టు సమస్యలపై వినతిపత్రాలు అందజేశాం. ఆగస్టు 6వ తేదీ జరిగే క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం యోచన చేయబోతున్నట్టుగా తెలిసి మరోసారి మా సమస్యలను మీ ముందుంచే ప్రయత్నం చేస్తున్నాం.

1. జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపు:

ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు సమస్య చాలాయేళ్ళుగా అపరిష్కృతంగా ఉంది. ఎన్నికల సమయంలోనే జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఒకరికి మూడు సెంట్లు చొప్పున కేటాయిస్తామని గత ప్రభుత్వం జీవో జారీ చేసి దరఖాస్తులను స్వీకరించింది. వారికి స్థలాల కేటాయింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం. ఇళ్లు కట్టుకునేందుకు తగిన ఆర్ధిక సహాయం అందించాలని కోరుతున్నాం.

జర్నలిస్టుల ఇంటిస్థలాలకు సంబంధించి రాష్ట్రంలోని విజయవాడ నున్న సొసైటి, విశాఖపట్నంలోని సొసైటీ, అనంతపురం జిల్లా హిందూపురంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 ఫిబ్రవరిలో విశాఖపట్నం జర్నలిస్టులకు ఇంటిస్థలాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి నిర్ణయించిన ధర చెల్లించినప్పటికీ ఇప్పటివరకు స్థలాలు అప్పగించలేదు. అనంతపురం జిల్లా హిందూపురంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ వారికి అప్పగించలేదు.

గిరిజన ప్రాంతాల్లోని జర్నలిస్టులకు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఇళ్లస్థలాల కేటాయింపు చేయాలని అభ్యర్థిస్తున్నాం.







రాష్ట్రంలోని జర్నలిస్టుల గృహనిర్మాణానికి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించే యోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**2. మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలి:**

మారిన పరిస్థితుల్లో జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడింది. జర్నలిస్టుకు రక్షణ కొరవడంది. రక్షణ లేని వృత్తిగా జర్నలిజం ప్రపంచదేశాల్లో 149వ స్థానంలో ఉంది. ప్రజాస్వామిక దేశమైనప్పటికీ జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, పనిపరిస్థితులు, ఇతర సదుపాయాలు తదితర అంశాలన్నింటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం మీడియా కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నాం. ఈ కమిషన్ పనిచేస్తున్న లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో సీనియర్ జర్నలిస్టులు, ఉన్నత అధికారులతో ఆరునెలల లోపు నివేదిక అందజేసేలా తగినచర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**3. జర్నలిస్టులకు పెన్షన్:**

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ పథకాన్ని









అమలు చేస్తున్నాయి. ఇటీవల బీహార్‌లోని జర్నలిస్టులకు పెన్షన్ మొత్తాన్ని ఆరువేల నుంచి పదిహేను వేల రూపాయలకు పెంచుతూ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ప్రకటించారు. మనరాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు వీలుగా ఒక కమిటీని నియమించాలని కోరుతున్నాం. అ కమిటీ నివేదిక ఆధారంగా పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**4. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ప్రచురణ పునరుద్ధరణ**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపు యాభైయేళ్లకు పైగా ఆంధ్రప్రదేశ్ మాసపత్రికను ప్రచురిస్తోంది. ప్రభుత్వం అమలుచేసే వివిధ కార్యక్రమాలు, పథకాలు, ప్రజాప్రయోజన అంశాల ప్రస్తావన ఈ పత్రికలో ఉండేవి. ఇటీవల కాలంలో ఆ పత్రిక ప్రచురణ నిలిపివేశారు. తిరిగి ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ప్రచురణ పునరుద్ధరించాలని కోరుతున్నాం.

**5. సమాచార శాఖను బలోపేతం చేయాలి**

ఇంధ్రప్రదేశ్‌లో జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 26 జిల్లాలు ఏర్పాటుచేశారు. అందుకు అనుగుణంగా జిల్లాల్లో సమాచార శాఖను మరింత పటిష్టం చేయాలని కోరుతున్నాం. అన్ని జిల్లాల కార్యాలయాలకు తగినంత మంది సిబ్బందిని నియమించడంతో పాటు జర్నలిస్టుల సమాచార సేకరణకు వీలుగా కార్యాలయాలను అధునికీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**6. అక్రిడిటేషన్ల జారీ:**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఇచ్చే అక్రిడిటేషన్ కార్డుల జారీ కాకపోవడంతో పాతకార్డులనే కొనసాగిస్తున్నారు. సమాచార శాఖ మంత్రి

నేతృత్వంలో సచివాలయంలో నవంబరు నెలాఖరులో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వం సానుకూల వైఖరితో వ్యవహరిస్తుందని హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే అక్రిడిటేషన్ల జీవోను తీసుకువచ్చి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ కోరుతోంది.

**అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ సమాచారం ఆధారంగా సమాచార శాఖ రాష్ట్ర, జిల్లా అక్రిడిటేషన్ల కమిటీల నియామకంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతర కాలంలో ఆ ఉత్తర్వుల అమలుపై వెనక్కు తగ్గింది. ఆయా కమిటీలలో ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్‌కు, ఎపిబిజెఎకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాం.

**7. జర్నలిస్టులందరికీ రాయితీపై ఎసి ప్రయాణం:**

రాష్ట్ర కేంద్రంలోని జర్నలిస్టులకు ఉన్న రీతిలో రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ రాయితీపై ఎసి బస్సుల్లో ప్రయాణం చేసేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**8. జర్నలిస్టు కమిటీలు:**

జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో హెూంశాఖ మంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాలో ఉన్నత పోలీసు అధికారులతో కూడిన కమిటీలు వేసేందుకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కమిటీలు లేవు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ ఫండ్ కమిటీ కూడా ఏర్పాటు కాలేదు. వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్






ఫండ్ కమిటీని తక్షణమే పునరుద్ధరించి ఈ విపత్కర పరిస్థితుల్లో కష్టాల పాలవుతున్న జర్నలిస్టులను ఆదుకునేందుకు వీలుగా తగిన మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు తగిన నిధులు కేటాయించాలని కోరుతున్నాం. ఈ కమిటీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. వర్కింగ్ జర్నలిస్టు వెల్‌ఫేర్ ఫండ్‌కు 50 కోట్ల రూపాయలను కేటాయించాలని కోరుతున్నాం.

**9. మీడియా అకాడెమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు:**

రాష్ట్రంలో సి.రాఘవచారి మీడియా అకాడెమీ ఉన్నది. చైర్మన్ నియామకం జరిగింది కానీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయలేదు. రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. అకాడమీ పనితీరు పారదర్శకంగా ఉండేందుకు వీలుగా గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎ.పి.బి.జె.ఎ)లకు గవర్నింగ్ కౌన్సిల్‌లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నాం.

**10. జర్నలిస్టుల అవార్డులు:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా సమాచార శాఖ అధ్వర్యంలో జర్నలిస్టులకు ఇవ్వాల్సిన అవార్డులను కొన్ని సంవత్సరాలుగా ఇవ్వడం లేదు. ప్రముఖుల పేరిట ఇస్తున్న ఈ అవార్డులు ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు గైకొనాలని కోరుతున్నాం.

**11. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత:**

వర్కింగ్ జర్నలిస్టు చట్టంతో పాటు ఇతర కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని అక్రమంగా తొలగిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కార్మిక శాఖను ఆదేశించాలని కోరుతున్నాం. అదేవిధంగా అక్రమంగా తొలగించిన జర్నలిస్టులు, ఇతర

సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకునే విధంగా కార్మిక శాఖ తగు చర్యలు తీసుకునేందుకు అవసరమైన అదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.

**12. కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలి:**

కార్మిక శాఖ పరిధిలో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కల్పిస్తున్న బీమా పథకం జర్నలిస్టులకు వర్తింపజేసేందుకు వీలుగా కార్మిక శాఖ కమిషనర్ ప్రతిపాదనలు పంపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకుని జర్నలిస్టులకు బీమా సదుపాయం కల్పించాలని కోరుతున్నాం.

**13. జర్నలిస్టుల ఆరోగ్యబీమాపై సమీక్ష:**

జర్నలిస్టులకు అమలవుతున్న ఆరోగ్యబీమా పథకం అమలు తీరుతెన్నులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా పర్యవేక్షణ కమిటీ నియమించాలని కోరుతున్నాం. ఆరోగ్యబీమా పథకం నిరంతరంగా కొనసాగేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రతియేటా రెన్యువల్ చేయడంలో చాలా జాప్యం జరుగుతున్నది. ఈ జాప్యాన్ని నివారించి క్రమం తప్పకుండా పథకం కొనసాగేలా చూడాలని కోరుతున్నాం.

**14. జర్నలిస్టుల వృద్ధాశ్రమ ఏర్పాటు:**

జర్నలిస్టుల సామాజిక భద్రత విషయంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని కోరుతున్నాం. వృద్ధ జర్నలిస్టుల స్థితిగతులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కేంద్రంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

పై సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తగిన విధంగా స్పందించి పరిష్కరించాలని కోరుతున్నాం.

---

# జర్నలిస్టుల డిమాండ్స్ డే

జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా వివిధ జిల్లాల్లో ఫెడరేషన్ నాయకత్వంలో కార్యక్రమాలు జరిగాయి.

**నెల్లూరులో**

ఆగస్టు 4 జర్నలిస్టుల హక్కుల దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన భవన్ ప్రాంగణం వద్ద జర్నలిస్టుల సమస్యల గురించి జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యదర్శి కె సుధాకర్, ఏపీబీజేఏ జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నరసింహులు, కే కోటేశ్వరరావు, యు వి రమణయ్య, ఆర్.మాధవయ్య, పి.వెంకటేశ్వర్లు, కె.బాబు , డి మహేష్, జి.కరుణానిధి, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతిలో**

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర , జిల్లా నాయకులు గోపి, శ్రీధర్, తులసీరామ్, జయ కుమార్ శ్రీనివాసులు, వాణి జిల్లా రెవెన్యూ అధికారి నర్సింహులుకు వినతి పత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్లో మీకోసం సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**గుంటూరులో**

గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో, పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు గుంటూరుజిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎల ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఫెడరేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి పట్నాల సాయికుమార్, వరదల మహేష్ ఎపిబిజెఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు బోస్క సువర్ణ బాబు, కార్యదర్శి కేశంశెట్టి శ్రీనివాస్, రవి గుంటూరు నగర అధ్యక్షులు ప్రమోద్ కార్యదర్శి షణ్ముఖ,శ్యామ్యూల్ వంశీ, శ్రీనివాస్, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళంలో**

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.భీమారావు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా పరిషత్ సమావేశ

మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు డి.నందికేశ్వరరావు, నరసన్నపేట నియోజకవర్గకమిటీ అధ్యక్షుడు కంగు మన్మథరావు, ఏపీబీజేఏ ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, జిల్లా ప్రతినిధులు శేఖర్, శివశంకర్, ఆర్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరులో**

జర్నలిస్టు డిమాండ్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జబీర్, వైవీహరీష్ ఆధ్వర్యంలో జర్నలిస్టు సోదరులు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ శ్రీమతి వెట్రి సెల్వికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. మీ సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఏలూరు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కే సోమశేఖర్, సీనియర్ నాయకులు ఎస్ కే బాబ్జి, మిల్టన్ ప్రతాప్, జర్నలిస్టులు జయరాం, సజ్జి, సిహెచ్ ప్రతాప్, నాగేశ్వరరావు, ఎస్.కె అఖిల్, శరత్ బాబు, కళ్యాణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, సతీష్, సిహెచ్ శ్రీనివాస్, సన్నీ, మౌనిక, నవీన్, కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురంలో**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలని, అక్రిడేషన్లు తక్షణమే ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.


**భీమవరంలో**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు గుండా రామకృష్ణ ఆధ్వర్యంలో జెసి రాహుల్ కుమార్ రెడ్డికి భీమవరంలో జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీకి చెందిన పలువురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



**గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జర్నలిస్ట్ హెల్త్ కార్డును, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు చేతుల మీదుగా ఎపిబిజెఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు బోస్క సువర్ణ బాబు స్వీకరిస్తున్న దృశ్యం**

# నగరాభివృద్ధి ప్రతిబింబం ఫోటో ఎగ్జిబిషన్




విశాఖపట్నం బీచ్ రోడ్డులో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని రెండవ రోజుల ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫోటోగ్రాఫర్ల ప్రత్యేక ఛాయాచిత్ర ప్రదర్శనను నిశితంగా పరిశీలించి ఆయన స్వయంగా తన మొబైల్ ద్వారా క్లిక్ మనిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఫోటో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఆద్యంతం అద్భుతంగా ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఒకవైపు నగరాభివృద్ధికి సంబంధించిన ఫోటోలతో పాటు మరోవైపు పలు సమస్యలను ప్రతిబింబిస్తూ, ఇంకోవైపు అనేక విజయాలకు స్ఫూర్తిగా నిలిచింది అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తే గత ఏడాదిగా జరిగిన అనేక సంఘటనలు మనకు గుర్తుకు రావడం ఖాయం అన్నారు.



ఫోటోగ్రాఫర్లు తీసే ఛాయాచిత్రాలు అక్కడ జరిగే సంఘటన కళ్ళకు కట్టేలా ప్రతిబింబిస్తాయని తెలియజేశారు. ఆయా ఫోటోల ద్వారా నగరంలో అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. వచ్చే సంవత్సరం తప్పకుండా స్క్రీన్ ద్వారా ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శన ప్రతి ఒక్కరూ తిలకించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి జీవీఎంసీ తరఫున సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయన్నారు. ప్రపంచ స్థాయిలో సైతం ఫోటోగ్రాఫర్స్‌కు గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రెండు రోజులు ఫోటో ఎగ్జిబిషన్‌లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. జీవీఎంసీ జోన్ త్రి జోనల్



కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ అద్భుతమైన రీతిలో ఫోటో ఎగ్జిబిషన్ ఉందన్నారు. కార్యక్రమంలో వైజాగ్ కమిషనర్ చేతుల మీదగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ఉత్తమ ఫోటో జర్నలిస్టులుగా గెలుపొందిన ఫోటో జర్నలిస్టులు కమిషనర్ చేతుల మీదుగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమానికి వైజాగ్ ఫోటో జర్నలిస్టుల ప్రెసిడెంట్ వై రామకృష్ణ అధ్యక్షత వహించగా సెక్రటరీ ఎండి నవాజ్, కోశాధికారి ఏ శరత్ కుమార్ ఇతర సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులంతా కలిసి జీవీఎంసీ కమిషనర్‌ను ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ పాలునరావు, సింహాచలం దేవస్థానం ధర్మ కర్తల మండలి మాజీ సభ్యులు ఎపిడబ్ల్యుజెఎఫ్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జీవీఎంసీ పిఆర్ఓ నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు నగర ప్రజలు పాల్గొన్నారు.

# మీడియా అక్రిడిటేషన్ నియమ నిబంధనలు

రాష్ట్రంలోని మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ ప్రక్రియను నియంత్రించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ నియమాలు 2025ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియను సమగ్రంగా పునర్వ్యవస్థీకరించింది.

రాష్ట్రంలో మీడియా ప్రతినిధుల ఫ్రేమ్‌వర్క్‌ను మెరుగుపరచడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ కోసం కొత్త నియమాలను జారీ చేసింది.

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ నియమాలు 2025" ను తీసుకురావడం ద్వారా 2023లో జారీ చేసిన ఉత్తర్వులు రద్దయ్యాయి. జర్నలిస్ట్ సంఘాలు, మీడియా ప్రతినిధులు సహా భాగస్వామ్య పక్షాలతో సంప్రదించిన తర్వాత కొత్త నియమాలను రూపొందించారు.

ప్రస్తుత అక్రిడిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను సమీక్షించడానికి, సవరణలను సూచించడానికి ఐదుగురు సభ్యుల విభాగ కమిటీని ఏర్పాటు చేశారు. రూపొందించిన నియమాలు వెంటనే అమలులోకి వస్తాయి.

అక్రిడిటేషన్‌లోని నిర్వచనాలు మరియు కీలక నిబంధనలు

స్పష్టత, సరైన అమలును నిర్ధారించడానికి నియమాలు మీడియా అక్రిడిటేషన్‌కు సంబంధించిన వివిధ పదాలను నిర్వచించాయి.

''అక్రిడిటేషన్'' అంటే అధికారిక సమాచారానికి ప్రాప్యత కోసం మీడియా ప్రతినిధుల గుర్తింపును సూచిస్తుంది.

మీడియా ప్రతినిధుల వర్గాలలో ఎడిటర్లు, బ్యూరో చీఫ్‌లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నుండి వివిధ జర్నలిస్టులు ఉన్నారు.

వివిధరకాల మీడియాకు, పెద్ద, మధ్యస్థ, చిన్న దినపత్రికలు, అలాగే ఎలక్ట్రానిక్ మీడియా యూనిట్లకు నిర్దిష్ట నిర్వచనాలు ఇచ్చారు.

అక్రిడిటేషన్ కమిటీల నిర్మాణం, కూర్పు నిబంధనలు రాష్ట్ర, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీల నిర్మాణం, కూర్పును వివరిస్తాయి.

రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎసి)లో జర్నలిస్ట్ సంఘాలు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు సహా 13 మంది సభ్యులు ఉంటారు.

జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డిఎంఎసి)కి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహిస్తారు. స్థానిక జర్నలిస్ట్ సంఘాలు, మీడియా సంస్థల ప్రతినిధులు ఉంటారు.

రెండు కమిటీలు రెండు సంవత్సరాల పదవీకాలం కలిగి ఉంటాయి. అక్రిడిటేషన్లను జారీ చేయడానికి, భర్తీ చేయడానికి బాధ్యత వహిస్తాయి.

కమిటీ సభ్యత్వానికి నిబంధనలు, షరతులు, నిబంధనలు అక్రిడిటేషన్ కమిటీలలో సభ్యత్వానికి అర్హత ప్రమాణాలు, షరతులను నిర్దేశిస్తాయి.

జర్నలిస్ట్ యూనియన్లు నమోదు చేసుకోవాలి. గత రెండు ఆర్థిక సంవత్సరాలకు వార్షిక రిటర్న్‌లను అందించాలి. కనీసం 200 మంది సభ్యులు ఉన్న యూనియన్లు మాత్రమే ఎస్ఎంఎసిలో ప్రాతినిధ్యం వహించడానికి అర్హులు, అయితే డిఎంఎసికి కనీసం 50 మంది సభ్యులు అవసరం.

నామినీల ఎంపిక యూనియన్ల సభ్యత్వ పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

మీడియా అక్రిడిటేషన్ పరిధి, వ్యవధి: అక్రిడిటేషన్ రెండు సంవత్సరాల కాలానికి మంజూరు చేయబడుతుంది. ఇది వ్యక్తిగతమైనది బదిలీ చేయబడదు. మీడియా ప్రతినిధులు తమ సంస్థకు ప్రాతినిధ్యం వహించడం ఆపివేస్తే అధికారులకు తెలియజేయాలి. అక్రిడిటేషన్ ఎటువంటి అధికారిక హోదాను ఇవ్వదు. ఖచ్చితంగా పాత్రికేయ ప్రయోజనాల కోసం మాత్రమే.

వార్తాపత్రికలు, పీరియాడికల్స్ కోసం అర్హత ప్రమాణాలు: అక్రిడిటేషన్ కోరుకునే వార్తాపత్రికలు, పీరియాడికల్స్ కోసం నియమాలు నిర్దిష్ట అర్హత ప్రమాణాలను ఏర్పాటు చేశాయి. వార్తాపత్రికలు అక్రిడిటేషన్ కోసం అర్హత పొందడానికి రోజుకు కనీసం 2,000 కాపీలు సర్క్యులేషన్ కలిగి ఉండాలి. పీరియాడికల్స్ ప్రతి సంచికకు కనీసం 1,000 కాపీలను ప్రచురించాలి. నిర్దిష్ట కంటెంట్ అవసరాలను తీర్చాలి. అక్రిడిటేషన్ మంజూరు చేయడానికి ముందు, తర్వాత ప్రచురణ క్రమబద్ధతను ధృవీకరించాలి.

వార్తా సంస్థలు, ఫోటో/వీడియో ఏజెన్సీలకు అర్హత ప్రమాణాలు: వార్తా సంస్థలు, ఫోటో/వీడియో ఏజెన్సీలు అక్రిడిటేషన్ పొందడానికి అవసరాలను నియమాలు వివరిస్తాయి. వార్తా సంస్థలు కనీసం ఐదు సంవత్సరాలు నమోదు చేసుకోవాలి. కనీసం రూ.లక్షా యాభై వేల కనీస స్థూల వార్షిక

ఆదాయం కలిగి ఉండాలి. ఫోటో ఏజెన్సీలకు కనీసం ఐదు సంవత్సరాల అనుభవం, వార్షిక ఆదాయం 3,00,000 ఉండాలి. రెండు రకాల ఏజెన్సీలు వారి పాత్రికేయ కార్యకలాపాలు, చందాదారుల సంబంధించిన ఆధారాలను సమర్పించాలి.

ఎలక్ట్రానిక్ మీడియాకు అక్రిడిటేషన్ ప్రమాణాలు: శాటిలైట్ న్యూస్ ఛానెల్స్, కేబుల్ నెట్‌వర్క్‌లకు అర్హత ప్రమాణాలను నియమాలు పేర్కొంటాయి. ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలి. సమాచార శాఖ విభాగంతో ఎంప్యానెల్ చేయబడాలి. ఉపగ్రహ ఛానెల్స్ ప్రతిరోజూ కనీసం 3.5 గంటల వార్తలను ప్రసారం చేయాలి, అయితే కేబుల్ ఛానెల్స్ కనీసం 1.5 గంటలు ప్రసారం చేయాలి. రిజిస్ట్రేషన్ నిర్వహించడం, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటంపై అక్రిడిటేషన్ ఆధారపడి ఉంటుంది.

ప్రెస్ ప్రతినిధులకు అర్హత ప్రమాణాలు: ప్రెస్ ప్రతినిధులు అక్రిడిటేషన్ పొందడానికి అవసరమైన అర్హతలను నియమాలు నిర్వచిస్తాయి.

ప్రెస్ ప్రతినిధులు వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం కింద గుర్తించబడాలి. అక్రిడిటేషన్ కోసం నిర్దిష్ట షరతులను నెరవేర్చాలి. నిబంధనలు వృత్తిపరమైన ప్రమాణాలు, నైతిక జర్నలిజం

# వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జీవో జారీ

ఆంధ్రప్రదేశణ ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ ఆగస్టు 19వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేస్తారు. అక్రిడిటేషన్ల జారీ నిమిత్తం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ జీవో వెలువడింది.

**మంత్రుల బృందం ప్రతిపాదనలకు ఆమోదం**

వర్కింగ్ జర్నలిస్టులకు జారీ చేసే అక్రిడిటేషన్లకు సంబంధించిన నియమనిబంధనలపై మంత్రుల బృందం చేసిన ప్రతిపాదనలను ఆగస్టు 6న జరిగిన మంత్రిమండలి ఆమోదించింది. ఈ విషయాన్ని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలియజేశారు.

ప్రస్తుత మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు,2023, 30.03.2023ను రద్దుపరచి, దాని స్థానంలో కొత్తగా రూపొందించిన “కాంప్రహెన్సివ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025” ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

కొత్త సమగ్ర, సమీకృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025కు కేబినెట్ ఆమోదం కోరుతూ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

తద్వారా రాష్ట్ర హెడ్ క్వార్టర్స్, పబ్లిషింగ్ సెంటర్లు, ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ మంజూరు చేయడం కోసం ఉన్న ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2023, 30.03.2023ను జారీ చేసిన ఉత్తర్వుల స్థానంలో కొత్తగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025 అమలులోకి రానుంది.

దీనిలో ముఖ్యంగా, రాష్ట్రంలోని వివిధ జర్నలిస్టు సంఘాలు అభ్యర్థించిన మేరకు నూతనంగా రూపొందించిన మీడియా నిబంధనలలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులకు అర్హత మేరకు రాష్ట్ర, జిల్లా అక్రిడిటేషన్ కమిటీలలో స్థానం లభించనుంది.

చిన్న వార్తాపత్రికల కేటగిరీకి చెందిన జర్నలిస్టులకు సహేతుక సంఖ్యలో అక్రిడిటేషన్లను మంజూరు చేసే సౌకర్యం కల్పించేందుకు ఎంపానెల్డ్, నాన్-ఎంపానెల్డ్ కేటగిరీలుగా చిన్న వార్తాపత్రికల వర్గీకరణ చేయడం జరిగింది.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై సమాచారాన్ని పొంది దానిని ప్రజలకు వ్యాప్తి చేయడానికి మీడియాకు అక్రిడిటేషన్ సౌకర్యం అందించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఇది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు విస్తరించబడుతుంది. ఆంధ్రప్రదేశ్ అధికార పరిధిలో ఉంటుంది.

ఎంతో కాలంగా జర్నలిస్టులు, వారి సంఘ ప్రతినిధులలో నెలకొన్న పలు మీమాంసలు ఈ కొత్త మీడియా రూల్స్ వలన తొలగనున్నాయి. కొత్త మీడియా అక్రిడిటేషన్ నిభందనల ప్రకారం అతిత్వరలో అక్రిడిటేషన్ మంజూరు ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే, రాష్ట్ర , జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల నియామకం జరగనుంది. సోషల్ మీడియాకి సంబందించి కూడా ఒక పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

పద్ధతులను నిర్వహించడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి.

మీడియా అక్రిడిటేషన్ కోసం అర్హత ప్రమాణాలు: రాష్ట్రంలో అక్రిడిటేషన్ కోరుకునే వివిధ మీడియా ప్రతినిధుల అర్హత అవసరాలను టెక్స్ట్ వివరిస్తుంది. అక్రిడిటేషన్ కోసం పూర్తి సమయం జర్నలిజం తప్పనిసరి.

వివిధ అనుభవ అవసరాలు: రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి 7 సంవత్సరాలు, జిల్లాకు 5 సంవత్సరాలు, మండల స్థాయికి 3 సంవత్సరాలు. ఫ్రీలాన్సర్లకు 10 సంవత్సరాల అనుభవం అవసరం. 12 ప్రచురించిన కథనాలు లేదా ఫోటో క్లిప్పింగ్‌లను సమర్పించాలి.

విద్యా అర్హతలు మారుతూ ఉంటాయి: రాష్ట్ర, జిల్లా స్థాయిలకు డిగ్రీ అవసరం. మండల స్థాయికి ఇంటర్మీడియట్. అనుభవ రుజువులో అక్రిడిటేషన్ కార్డులు, సిఫార్సు లేఖలు, పే స్లిప్‌లు ఉంటాయి.

మీడియా ప్రతినిధుల కోసం అక్రిడిటేషన్ ప్రక్రియ: అక్రిడిటేషన్ ప్రక్రియలో దరఖాస్తు సమర్పణ, కమిటీ సమీక్ష ఉంటుంది. దరఖాస్తులను డైరెక్టర్/కమిషనర్ లేదా కలెక్టర్‌కు సమర్పించాలి. రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎసి) దరఖాస్తులను సమీక్షిస్తుంది. సిఫార్సుల ఆధారంగా అక్రిడిటేషన్‌ను మంజూరు చేస్తుంది. ఆరు నెలల వరకు తాత్కాలిక అక్రిడిటేషన్ జారీ చేయబడుతుంది. ఒక స్థానానికి ఒక ప్రతినిధి మాత్రమే అక్రిడిటేషన్ పొందగలరు.

అక్రిడిటేషన్ మార్గదర్శకాల ఉపసంహరణ: ఈ అంశంలో అక్రిడిటేషన్‌ను సస్పెండ్ చేయడానికి లేదా ఉపసంహరించుకోవడానికి షరతులు ఉన్నాయి. జర్నలిజం కాని కార్యకలాపాలు లేదా అనైతిక ప్రవర్తనకు అక్రిడిటేషన్‌ను ఉపసంహరించుకోవచ్చు. అక్రిడిటేషన్ పొందిన ప్రతినిధి అందించిన తప్పుడు సమాచారం ఉపసంహరణకు దారితీస్తుంది. సంస్థ పనిచేయడం మానేస్తే లేదా ప్రతినిధి తీవ్రమైన నేరానికి పాల్పడితే అక్రిడిటేషన్ కూడా రద్దు చేయబడుతుంది.

అక్రిడిటేషన్ నిర్ణయాల కోసం అప్పీల్ ప్రక్రియ: అక్రిడిటేషన్ నిరాకరించబడిన దరఖాస్తుదారుల కోసం అప్పీల్ ప్రక్రియను వివరిస్తుంది.

బాధిత దరఖాస్తుదారులు జిల్లా స్థాయి డైరెక్టర్/కమిషనర్ లేదా రాష్ట్ర స్థాయి కార్యదర్శికి అప్పీల్ చేసుకోవచ్చు. అప్పీల్ ప్రక్రియ తిరస్కరించబడిన దరఖాస్తుల పునఃపరిశీలనను అనుమతిస్తుంది.

అక్రిడిటేషన్‌పై సమీక్ష, ప్రభుత్వ విచక్షణ: టెక్స్ట్‌లో అక్రిడిటేషన్ విషయాలలో ఆవర్తన సమీక్షలు, ప్రభుత్వ విచక్షణ గురించి ప్రస్తావించబడింది. అక్రిడిటేషన్ జాబితాల సమీక్షలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. అసాధారణ సందర్భాలలో అక్రిడిటేషన్ కోసం ప్రభుత్వం షరతులను సడలించవచ్చు. అవసరాల ఆధారంగా అక్రిడిటేషన్‌లను జారీ చేసే అధికారం డైరెక్టర్/కమిషనర్‌కు ఉంది.

వివిధ మీడియా రకాలకు అక్రిడిటేషన్ అర్హతలు: సర్క్యులేషన్, రకం ఆధారంగా వివిధ వర్గాల మీడియాకు అర్హతలను వివరిస్తుంది.

సర్క్యులేషన్ గణాంకాల ఆధారంగా పెద్ద, మధ్యస్థ, చిన్న దినపత్రికలకు నిర్దిష్ట అర్హతలు వివరించబడ్డాయి. వివిధ వర్గాల పత్రికలు వార్తా సంస్థలు ప్రత్యేకమైన అక్రిడిటేషన్ అవసరాలను కలిగి ఉంటాయి.

ఉపగ్రహ, కేబుల్ వార్తా ఛానెల్‌లు వాటి కార్యాచరణ స్థితి, కంటెంట్ ఆధారంగా నిర్దిష్ట అర్హతలను కలిగి ఉంటాయి.

అక్రిడిటేషన్ దరఖాస్తుల కోసం అవసరమైన డాక్యుమెంటేషన్:

జర్నలిస్టులు సంస్థల నుండి అక్రిడిటేషన్ దరఖాస్తుల కోసం అవసరమైన పత్రాల జాబితా

జర్నలిస్టులు ఐడి కార్డులు, అనుభవ ధృవీకరణ పత్రాలు, ప్రచురణ రుజువును సమర్పించాలి. సంస్థలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఆర్థిక పత్రాలు, లైసెన్స్‌లను అందించాలి.

అక్రిడిటేషన్ నియమాలకు అర్హత, సమ్మతిని నిర్ధారించడానికి సమగ్ర పత్రాల సమితి అవసరం.



# జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణకు చర్యలు

## పుట్టా మహేష్ కుమార్ ప్రశ్నకు కేంద్ర మంత్రి స్పందన

కోవిడ్ సమయంలో నిలిపివేసిన జర్నలిస్ట్ పాసుల పునరుద్ధరణకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని రైల్వేలు, సమాచార, ప్రసారం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆగస్టు 22న పార్లమెంటులో వెల్లడించారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా జర్నలిస్టులకు రైల్వే పాసుల సౌకర్యం పునరుద్ధరించాలనే అంశంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు రైల్వేలు, సమాచార, ప్రసారం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

భారతీయ రైల్వేలు సమాజంలోని అన్ని వర్గాలకు సరసమైన సేవలను అందించడానికి కృషి చేస్తుందని, 2023-24 సంవత్సరంలో ప్రయాణికుల టిక్కెట్లపై రూ. 60,466 కోట్ల రాయితీ అందించామని, రైల్వేలో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ సగటున 45 శాతం రాయితీకి సమానం అని, రూ.100 ఖర్చవుతున్న సేవను కేవలం 55రూపాయలకే ప్రయాణికులకు అందిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

ఈ రాయితీతో పాటు, 4 వర్గాల దివ్యాంగులకు, 11 వర్గాల రోగులకు, 8 వర్గాల విద్యార్థులకు ప్రత్యేక రాయితీలు కొనసాగుతున్నాయని, జర్నలిస్టుల రైల్వే పాస్ సౌకర్యం నిలిపివేతపై పలు సంఘాలు, వ్యక్తుల నుంచి ప్రతిపాదనలు, విజ్ఞప్తులు రైల్వేలకు చేరుతున్నాయని,ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి సాధ్యమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్-19 మహమ్మారి సమయంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు రైల్వే పాస్ సౌకర్యం పునరుద్ధరించాలన్న డిమాండ్ న్యాయసమ్మతమైందని, జర్నలిస్టులు ప్రజలకు సమయానుకూలంగా, పారదర్శకంగా సమాచారం చేరవేయడంలో విశేష పాత్ర పోషిస్తున్నారని, ఈ అంశంపై తాను లోక్‌సభలో ప్రశ్నించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

# ఈపీఎఫ్ డెత్ రిలీఫ్ 15 లక్షలకు పెంపు

ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు సర్వీస్‌లో ఉన్నప్పుడు చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను ఈపీఎఫ్ఓ 15లక్షలకు పెంచింది. ప్రావిడెంట్ ఫండ్ అనేది ఉద్యోగులకు బంగారు నిధి లాంటిది. దేశంలో పనిచేసే ప్రతి ఉద్యోగికి పిఎఫ్ ఖాతా తప్పనిసరిగా ఉంటుంది. పిఎఫ్‌కు సంబంధించి ఈపీఎఫ్ఓ ఎప్పటికప్పుడు మార్పులు తీసుకొస్తుంది. తాజాగా పిఎఫ్ ఖాతాదారులు మరణిస్తే వారి కుటుంబానికి లభించే డెత్ రిలీఫ్ ఫండ్‌ను భారీగా పెంచింది. గతంలో ఉన్న 8.8 లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మొత్తాన్ని సిబ్బంది సంక్షేమ నిధి నుంచి ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ కొత్త నిబంధన 2025 ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చినట్టు స్పష్టం చేసింది. అంటే ఎవరైనా ఉద్యోగి ఆ తేదీ తర్వాత మరణిస్తే అతని కుటుంబానికి 15 లక్షలు లభిస్తాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ నుంచి ఈ మార్పునకు ఆమోదం లభించింది. ఈ మేరకు ఆగస్టు 19న సర్క్యులర్ జారీ అయింది. డెత్ రిలీఫ్ ఫండ్ కింద ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని పెంచడానికి ప్రావిడెంట్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్, ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆమోదం లభించింది. సెంట్రల్ బోర్డులో మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు సిబ్బంది సంక్షేమ నిధి నుంచి 15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి అని ఈపీఎఫ్ సర్క్యులర్‌లో పేర్కొంది. అలాగే 2026 ఏప్రిల్ ఒకటి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రతి ఏటా ఐదు శాతం పెరుగుతుందని వెల్లడించింది. దీంతో మృతుల కుటుంబాలకు అందించే ఆర్థిక సహాయం కాలక్రమంలో పెరుగుతుంది. పీఎఫ్ ఖాతాదారుడు మరణించిన తర్వాత డబ్బు మైనర్ పిల్లలకు చెందాల్సి వస్తే డెత్ క్లైమ్ ప్రక్రియ ఇప్పుడు మరింత సులభతరమైంది. ఇంతకుముందు గార్డియన్ షిప్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి వచ్చేది. దీంతో క్లెయిమ్ ప్రక్రియ ఆలస్యం అయ్యేది. కానీ ఇప్పుడు ఈ నిబంధనను తీసేశారు. ఈ మార్పుతో మైనర్ పిల్లలు డబ్బును త్వరగా పొందవచ్చు.



# అక్రిడిటేషన్ జీఓలో మార్పులు చేయాలి

## ఏపీడబ్ల్యూజెఎఫ్ వినతి

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ జీఓలో మార్పులు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ అధికారులకు ఏపీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు ఆగస్టు26న వినతి పత్రం అందజేశారు. విజయవాడలోని బస్సుభవన్‌లో సమాచార శాఖ ఆడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత, జెడీ కిరణ్ కుమార్‌లకు ఏపీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. వెంకట్రావు, జి. ఆంజనేయులు నేతృత్వంలో ఇతర ఫెడరేషన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రిడిటేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో మహిళా జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. చిన్న పత్రికల నుంచి ప్రాతినిధ్యం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అయితే 2016 నుంచి పత్రికల ఎంప్యానల్ ప్రక్రియను నిలిపివేశారని, ఆ సమస్యను పరిష్కరం చేస్తే ఆ పత్రికల్లో పని చేసే వారికీ కూడా తగినన్ని అక్రిడిటేషన్లు పొందే అవకాశం ఉంటుందనీ, ఆ దిశగా అధికారులు యోచన చేయాలని కోరారు. ఎంపానల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఆరునెలల్లోపు ఎంపానల్ ప్రక్రియ పూర్తయ్యేట్టు చూడాలని కోరారు. అక్రిడిటేషన్ జారీకి నియామకాన్ని, అనుభవాన్ని అర్హతగా పరిగణించాలని విద్యార్హత తప్పనిసరి చేయరాదని కోరారు. సమాచార శాఖ అధికారులను కలిసిన ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఖాజావలీ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, ఎం.రాఘవులు, మైలవరం నాయకులు షేక్ సల్మాన్, వీసం సురేష్‌బాబు, తుపాకుల హరికృష్ణ, అవుటి బాబు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మైలవరం, నందిగామ నియోజకవర్గాలకు చెందిన ఫెడరేషన్ నాయకులు హాజరయ్యారు.





# మూడేళ్ళుగా విచారణ ఖైదీగా జైల్లో జర్నలిస్టు

## ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకోని అధికారులు

**బీహార్ లోని భాగల్పూర్‌లోని షహీద్ జుబ్బా సహాని సెంట్రల్ జైలులో నిర్బంధంలోని అండర్ ట్రయల్ ఖైదీ జర్నలిస్ట్ రూపేష్ కుమార్ సింగ్ ఆరోగ్యం తీవ్రంగా క్షీణిస్తున్నది. గత మూడు సంవత్సరాలుగా జైలులో ఉన్న రూపేష్ ఆరోగ్యం ఆందోళనకరమైన స్థాయిలో దిగజారింది. ఈ నేపథ్యంలో రూపేష్‌ను మెరుగైన సౌకర్యాలు కలిగిన మరింత సరైన ప్రదేశానికి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ డిఐజి (జైళ్లు)కి అతని భార్య ఇప్సా శతక్షి లేఖ రాసింది. రూపేష్ విడుదల కోరుతూ జర్నలిస్టులు, ప్రజాస్వామికవాదులు, న్యాయవాదులు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు.**

రూపేష్ కుమార్ సింగ్ అండర్ ట్రయల్ ఖైదీగా దాదాపు మూడున్నర సంవత్సరాలుగా జైల్లో మగ్గుతున్నారు. జూలై 17, 2022న ఉపాచట్టం కింద ఆయనను అరెస్టు చేశారు. 2014 నుండి జార్ఖండ్‌లోని స్వతంత్ర జర్నలిస్ట్‌గా రూపేష్ రిపోర్టింగ్ చేస్తున్నాడు. జార్ఖండ్‌తో పాటు మధ్య భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో అత్యాచారం, అక్రమ అరెస్టులు, చట్టవిరుద్ధ హత్యలు వంటి మానవ హక్కుల ఉల్లంఘనలను ఆయన కథనాలుగా వివిధ వార్తా సంస్థల్లో ప్రచురితమయ్యాయి. కుమార్ ది వైర్, న్యూస్‌క్లిక్, జాన్‌చౌక్ వంటి వివిధ సంస్థలకు వ్యాసాలు రాస్తున్నాడు. అరెస్టయ్యేందుకు రెండు రోజుల ముందు, ఆదివాసీలకు చెందిన వ్యవసాయ భూములలో పారిశ్రామిక వ్యర్థాలను పారవేయడం వల్ల జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లాలో నివసించే వారి ఆరోగ్యంపై విపత్కర ప్రభావం చూపుతుందని ఆయన నివేదించారు.

జార్ఖండ్‌కు చెందిన జర్నలిస్ట్ రూపేష్ కుమార్ ఈ యేడాది ఏప్రిల్ 11నాటికి ఆయన జైల్లో ఉండి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్నందున, కార్యకర్తలు, న్యాయవాదులు జర్నలిస్టులతో కూడిన పౌర సమాజం, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖ రాసింది. అరెస్టు తర్వాత, అతనిని తప్పుడు ఆరోపణలు చేసి నకిలీ మావోయిస్టు కేసులకు సంబంధించిన మరో నాలుగు కేసుల్లో అరెస్టు చేసినట్లు ప్రకటించారు. రూపేష్ కుమార్ సింగ్‌పై బహుళ కేసులు నమోదు చేయడం, ఈ ప్రక్రియనే శిక్షగా మార్చడం ద్వారా అతను చాలా కాలం పాటు జైలులో ఉండేలా చూసుకోవాలనే భారత ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది” అని లేఖలో పేర్కొన్నారు.

ఆయనకు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాతో సంబంధాలు కలిగి ఉన్నారని, మావోయిస్టులకు చట్టవిరుద్ధంగా నిధులు సమకూర్చారనే ఆరోపణలపై 37 ఏళ్ల కుమార్ జైలు పాలయ్యారు. అతనిపై క్రూరమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా), భారత శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

“జార్ఖండ్‌లోని ఇతర ప్రాంతాలలో అత్యాచారం, అక్రమ అరెస్టులు, చట్టవిరుద్ధ హత్యలు వంటి మానవ హక్కుల ఉల్లంఘనలను బహిర్గతం చేయడానికి రూపేష్ కుమార్ అనేక మీడియా సంస్థలకు గ్రౌండ్ లెవల్ రిపోర్టింగ్ చేస్తున్నాడు. అరెస్టుకు ముందు, ఫ్యాక్టరీ కాలుష్య వ్యర్థాలు సాధారణ ప్రజల జీవితాలను

ఎలా ప్రభావితం చేశాయో, వివిధ ఆరోగ్య సమస్యలను ఎలా సృష్టించాయో కూడా అతను నివేదించాడు".

ఈ ఏడాది జనవరిలో, సుప్రీంకోర్టు కుమార్ బెయిల్ దరఖాస్తును తిరస్కరించింది.

ముందస్తుగా మక్తూబ్‌తో మాట్లాడుతూ, ఈ ఉత్తర్వుతో తన నిరాశను పంచుకున్నారు, కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు.

"ఆయన కేవలం ఒక జర్నలిస్ట్ మాత్రమే తన ఉద్యోగం చేసుకుంటున్నారు, జైల్లో తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న తన భర్తను మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండే చోటికి తరలించాలి" అని ఆయన భార్య ఇప్సా శతాక్షి అన్నారు. ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖలో కుమార్ పని మానవ హక్కుల ఉల్లంఘనలను అలాగే కార్పొరేట్ ప్రేరిత జీవితాలు పర్యావరణ విధ్వంసాన్ని బహిర్గతం చేసిందని, ''ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలపై సత్యాన్ని వెలికితీసే ఆయన నిబద్ధతతో పాటు, బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్ట్ బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాన కారణం" అని పేర్కొన్నారు.

''ప్రారంభంలో, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) పాలించే జార్ఖండ్ ప్రభుత్వం అతన్ని లక్ష్యంగా చేసుకుంది, తరువాత ఎన్ఐఎ, ఇతర సంస్థలు అతని కేసులో జోక్యం చేసుకున్నాయి. జర్నలిస్ట్ రూపేష్ కుమార్ కేసు, పత్రికా స్వేచ్ఛను బెదిరిస్తూ, భిన్నాభిప్రాయాలను అణచివేస్తున్నది హిందూత్వ-ఫాసిస్ట్ పార్టీ మాత్రమే కాదని,








వివిధ రాష్ట్రాలలోని ఇతర పాలక రాజకీయ పార్టీలు కూడా తమ ప్రజా వ్యతిరేక విధానాలను సవాలు చేసినప్పుడు ఒకే వైపున ఉన్నాయని మనం ఆలోచించేలా చేసింది," అని లేఖలో పేర్కొన్నారు.

కుమార్ ఫోన్‌లో దొరికిన పెగాసస్ వంటి ఇజ్రాయెల్ ఆధారిత నిఘా సాధనాల గురించి మాట్లాడుతూ, జర్నలిస్టులపై దాడులు భారీగా పెరిగాయని, ముఖ్యంగా వారి దురాగతాలు, ప్రజల సాధారణ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర వైఫల్యం ప్రజల ఉద్యమాలను నివేదిస్తున్నాయని ఆ లేఖ పేర్కొంది.

" పెగాసస్ మాల్వేర్ వంటి జియోనిస్ట్ టెక్నాలజీని ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి పరికరాల్లో నిఘా పెట్టడానికి అలాగే నేరారోపణ చేసే విషయాల నిరూపణకు నిఘా సంస్థలు ఉపయోగించుకున్నాయి. రూపేష్ కుమార్ కూడా ఇదే మాల్వేర్ ద్వారా ప్రజానుకూల రిపోర్టింగ్ లక్ష్యంగా పెట్టుకుని పనిచేశాడు. జర్నలిస్ట్ రూపేష్ కుమార్ సింగ్‌ను, తన ప్రజానుకూల రిపోర్టింగ్‌ను నిశ్శబ్దం చేయడానికి ప్రభుత్వం చూపుతున్న ఆసక్తి. రూపేష్‌కుమార్ సింగ్ రచనలు ప్రజల జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసే రాష్ట్ర-కార్పొరేట్ సంబంధాన్ని బహిర్గతం చేస్తుంది" అని ఆ లేఖ పేర్కొంది.

అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల సంస్థలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షకులు బహిరంగ లేఖపై సంతకం చేయాలని, అక్రమ నిర్బంధం నుండి జర్నలిస్ట్ రూపేష్ కుమార్ సింగ్‌ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అతనికి సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తూ లేఖ ముగిసింది.



# గాజాపై ఇజ్రాయిల్ దాడిలో జర్నలిస్టులు మృతి

ఇజ్రాయిల్ సైన్యం గాజాలోని ఆసుపత్రులపై ఆగస్టు 10న, 26వ తేదీ చేసిన దాడుల్లో సాధారణ పౌరులతో పాటు జర్నలిస్టులు చనిపోయారు. గాజాలోని అల్ షిపా ఆసుపత్రిపై, నసర్ ఆసుపత్రిపై ఈ దాడులు జరిగాయి. విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై సైనిక దాడులు జరగడం పట్ల ప్రపంచ దేశాలు తమ నిరసన వ్యక్తం చేశాయి. ఈ దాడుల్లో రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, అల్ జజీరాకు చెందిన రిపోర్టర్లు, విడియోగ్రాఫర్లు, కెమెరామెన్లు చనిపోయారు. ఈ సంఘటనపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది.

**అల్ షిపా ఆసుపత్రిపై దాడి**

గాజాలోని అల్ షిఫా ఆసుపత్రి పై ఆగస్టు 10న ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ప్రముఖ మీడియా సంస్థ అల్ జజీరాకు చెందిన ఐదుగురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి మెయిన్ గేటు బయట ఉన్న మీడియా టెంట్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. ఈ సంఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా అందులో ఐదుగురు జర్నలిస్టులు అల్ జజీరా మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టులు. అనాస్ అల్ షరీఫ్. మహమ్మద్ క్రీకే, కెమెరామెన్లు ఇబ్రహీం జహీర్, మొమెన్ అలివా, మహమ్మద్ నౌపల్ మరణించినట్లు అల్ జజీరా సంస్థ తెలియజేసింది. ఈ దాడులు జరిగిన కొద్దిసేపటి తర్వాత ఇజ్రాయిల్ మిలటరీ దీనిపై ప్రకటన చేస్తూ అనాస్ అల్ షరీఫ్ ఉగ్రవాది అని పేర్కొంది. ఇజ్రాయిల్ చేసిన ఈ దాడిపై పాలస్తీనా జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల సంఘాలు ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేయటమే కాక పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న సమరంలో విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని తప్పుబట్టారు. న్యూయార్క్‌లో జర్నలిస్టులు ఇజ్రాయిల్ సైన్యం జర్నలిస్టులపై దాడి చేసి చంపడాన్ని తీవ్రంగా ఖండించారు.



**నాసర్ ఆసుపత్రిపై దాడి**

దక్షిణ గాజాలోని నాసర్ ఆసుపత్రిపై ఇజ్రాయిల్ సైనిక దళం మరోసారి దాడులు చేసింది. దాడుల్లో అంతర్జాతీయ మీడియా తరపున పనిచేసే ఐదుగురు జర్నలిస్టులు మరణించారు. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, అల్ జజీరా తరపున పనిచేస్తున్న జర్నలిస్టులు, కెమెరామెన్లు ఈ దాడుల్లో మరణించారు. పదిహేను రోజులు గడవకముందే జర్నలిస్టులపై ఇజ్రాయిల్ మరోసారి హత్యాకాండకు పాల్పడింది. రెండుసార్లు జరిపిన కాల్పుల్లో జర్నలిస్టుల సహాయ సిబ్బందితో సహా మొత్తం 20 మంది మరణఈంచారు.

ఖాన్ యూనిస్ లోని నసర్ ఆసుపత్రి పై ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడిలో రైటర్స్ వార్తా సంస్థకు చెందిన కెమెరామెన్ హసన్ అల్ మస్రి, అసోసియేటెడ్ ప్రేస్ తరపున పనిచేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు మరియం దగ్గా, మిడిల్ ఈస్ట్ ఐ తరపున జర్నలిస్టుగా పనిచేస్తున్న మహమ్మద్ సలమా, అల్ జజీరా ఫోటోగ్రాఫర్ మూవీస్ అబూతః, మిడిల్ ఈస్ట్ ఐ తరపున పనిచేస్తున్న అహ్మద్ ఈ దాడిలో మరణించారు. కాంట్రాక్టు పద్ధతిలో తమ కోసం పనిచేస్తున్న ఫోటో జర్నలిస్టులు హాసమ్ అల్ మస్రీ హత్యకు గురైనట్లు రాయిటర్స్ ప్రకటించింది.

రాయిటర్స్‌కు చెందిన మరో కాంట్రాక్ట్ ఫోటో జర్నలిస్టు హతీమ్ ఖాలిద్ దాడుల్లో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. 33 ఏళ్ల వయసు గల అసోసియేటెడ్ ప్రెస్ ఫ్రీ లాన్సర్ విజువల్ జర్నలిస్టు మరియం దగ్గా, అమెరికా టివి నెట్‌వర్క్ ఎన్బిసి విజువల్ జర్నలిస్ట్ అబూత, అల్ జజీరా ఫోటో జర్నలిస్ట్ మహమ్మద్ సలామా అక్కడికక్కడే మరణించారు. మరో జర్నలిస్టు అహ్మద్ గాయాలతో చికిత్స పొందుతూ మరణించారు. వీరితోపాటు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా మరణించారు. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆసుపత్రి భవనంపై ఎందుకు దాడి చేశారనే విషయాన్ని చెప్పలేదు కానీ దాడిపై ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మొదటిసారి ఆసుపత్రిపై జరిగిన గగనతల దాడుల్లో ఏడుగురు మరణించారు. దీంతో జర్నలిస్టులు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. మళ్లీ రెండోసారి కూడా ఆసుపత్రి పై దాడులు చేయడంతో జర్నలిస్టులతో సహా 12 మంది మరణించారు. మొదటిసారి దాడులు జరిగిన వెంటనే తమ ఫోటో జర్నలిస్టు ఆసుపత్రికి వెళ్లి లైవ్ వీడియో షూటింగ్ చేస్తుండగా రెండోసారి దాడులు జరిగాయని దీంతో ఆ లైవ్ వీడియో షూటింగ్ అర్ధంతరంగా మధ్యలోనే ఆగిపోయిందని రాయిటర్ తెలియజేసింది. 15 రోజుల క్రితం ఆగస్టు 10న గాజా అల్ షిఫా ఆసుపత్రి సమీపంలో ఆరుగురు జర్నలిస్టులను హత్య చేసింది. ఇలా ఒక్క నెలలోనే పెద్దసంఖ్యలో జర్నలిస్టులు ఇజ్రాయిల్ దాడుల్లో మరణించారు. 2023 అక్టోబర్ ఏడో తేదీ నుంచి గాజాలో కొనసాగిస్తున్న దాడుల్లో ఈనాటికి 689 రోజులుగా మొత్తం 244 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించగా 22 నెలల యుద్ధంలో 192 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్టు ప్రకటించింది. ప్రధానంగా అల్ జజీరా న్యూస్ ఛానల్ కు చెందిన జర్నలిస్టులకు హమాస్ ఉగ్రవాదులకు సంబంధం ఉందని. ఉగ్రవాదులకు అల్ జజీరా జర్నలిస్టులు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆరోపిస్తూ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులను జర్నలిస్టు కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి హతమారుస్తున్నది. ఇప్పటివరకు ఆరుగురు అల్ జజీరా జర్నలిస్టులను హత్య చేసింది. రాయిటర్స్ వార్తా సంస్థ, నేషనల్ బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్ రెండు అనుసంధానమై ఉమ్మడిగా పనిచేస్తున్నాయి. ఈ ఒప్పందం కింద రాయిటర్స్ వార్తా సంస్థ ఇంటర్నెట్ సహా ఇతర హార్డ్‌వేర్



సదుపాయాలను సమకూరిస్తే ఎన్‌బీసీ సంస్థ డిజిటల్ సేవలను అందిస్తూ మధ్య ప్రాచ్యంలో వార్తలను ప్రపంచానికి అందిస్తున్నాయి. దక్షిణ గాజా ఖాన్ యూనిస్‌లో నజీర్ ఆసుపత్రిపై దాడుల సందర్భంగా తమ ఇద్దరు జర్నలిస్టులు మరణించినట్లు రాయిటర్స్ వార్త సంస్థ ప్రకటించింది.

**ఐక్యరాజ్యసమితి హెచ్చరిక**

దక్షిణ గాజాలో జర్నలిస్టుల మరణాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఖాన్ యూనిస్‌లోని ఆసుపత్రిలో దాడి వార్తలు కవర్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులు విధి నిర్వహణలో ఉన్న సమయంలో రెండోసారి కూడా ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేయడంతో అంతర్జాతీయ మీడియా తరఫున పనిచేస్తున్న ఐదుగురు జర్నలిస్టు సహా మొత్తం 20 మంది మరణించిన ఘటనను ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. "జర్నలిస్టులపై దాడి చేయకూడదు ఆసుపత్రులపై అస్సలు దాడి చేయకూడదు ఈ దాడులు చూసి దిగ్భ్రాంతితో మౌనంగా ఉండి పోవడం కాదు దీనికి జవాబుదారీ వహించాలని న్యాయం చేయాలని డిమాండ్ చేయాలి" అని ఐక్యరాజ్యసమితి హక్కుల కార్యాలయం అధికార ప్రతినిధి రవీనా షంతాననీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సహాయ సంస్థ ప్రధాన అధిపతి ఫిలిప్పీ లజ్జారిని తీవ్రంగా స్పందిస్తూ గాజాలో జరుగుతున్న మారణ హోమం ప్రపంచం మౌనం వహించటమే దిగ్భ్రాంతిని కలిగిస్తుందని అన్నారు. గాజాలో ఆకలి చావులకు, దారుణమైన మరణాలకు గురవుతున్న పిల్లలు, మహిళలకు సంబంధించిన వాస్తవాలను ప్రపంచానికి తెలియజేసే చిట్టచివరి జర్నలిస్టుల ప్రాణాలు కూడా తీసి అందరి నోళ్ళు మూయించాలని ఇజ్రాయిల్ ప్రయత్నం చేస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



# జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులని ప్రభుత్వ పరంగా వారి సంక్షేమానికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని వీఎమ్ఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబాలకు వినాయకుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. విశాఖపట్నం నగరంలోని అశీలమెట్ట జంక్షన్ వద్ద గల వేమన మందిరం ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 600 మంది జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రత కల్పం పుస్తకాలు, పలురకాల పూల పండ్ల మొక్కలు , మిఠాయిలు పంపిణీ చేశారు,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వీఎమ్ఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ హాజరయ్యారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మట్టి వినాయక ప్రతిమలనే పంపిణీ చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ ఉద్యానవన విభాగం డైరెక్టర్ మూల దామోదర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిధి మేరకు మొక్కలు పెంచాలని సూచించారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ్ మాట్లాడుతూ పని ఒత్తిడితో ఉండే జర్నలిస్ట్ మిత్రులు ఈ పండుగను ఆనందంగా జరుపు కోవాలన్నారు. జరలిస్టులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందని ఆశాభావంతో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షుడు ఈతోతి ఈశ్వర రావు, కార్యదర్శి కె.మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధవలేశ్వర్ రవికుమార్, ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్ కృష్ణమూర్తి నాయుడు, ఎమ్మెస్సార్ ప్రసాదు, నాయుడు, సత్యనారాయణ, రాజశేఖర్,, సీనియర్ జర్నలిస్ట్ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కార్టూనిస్ట్ శంకు మృతి



ప్రఖ్యాత కార్టూనిస్టు శంకు హైదరాబాద్‌లో కన్నుమూశారు. జాతీయ, అంతర్జాతీయ కార్టూనిస్ట్ దూరదర్శన్ డాక్యుమెంటరీలు ధారావాహికల నిర్మాత, దర్శకులు సంపర భీమ శంకర కుమార్ మృతి చెందారు. 1970-80ల్లో క్రోక్విల్ క్లబ్ సంస్థతో వర్ధమాన కార్టూనిస్టులకు కార్టునింగ్ ప్రక్రియలో సహాయపడ్డారు. దూరదర్శన్‌లో ధారావాహికలు, డాక్యుమెంటరీలు నిర్మించి దర్శకత్వం వహించారు. పలు నంది అవార్డులు సాధించారు. శంకు తెలుగు సినీ రంగంలో బాపు రమణల మిస్టర్ పెళ్ళాం సినిమాకు సహనిర్మాతగా వ్యవహరించారు. మీరు సతీమణి శోభాశంకర్ దూరదర్శన్, హైదరాబాద్లో న్యూస్ రీడర్‌గా పేరు గడించారు. ఆయన మృతి పట్ల విశాఖ నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూనిస్టుల ఫోరం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

మన జీవితాలపై ఫోటోగ్రఫీ లోతైన ప్రభావాన్ని గుర్తిస్తూ, క్షణాలను సంగ్రహించే కళను గుర్తుంచుకునేందుకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఫోటోగ్రఫీ అంటే కమ్యూనికేషన్. కథ చెప్పడం, డాక్యుమెంటేషన్‌ను ఎలా రూపొందిస్తావో చిత్రాలను పదిలపరుచుకోవడం ద్వారా చరిత్రను మరో పద్దతిలో రికార్డు చేయడమే. ప్రతి సంవత్సరం ఆగస్టు 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట ఇతివృత్తంపై కేంద్రీకరిస్తారు. అది సామాజిక మార్పు లేదా పర్యావరణ పరిరక్షణ వంటి నిర్దిష్ట ఇతివృత్తంపై దృష్టి పెడుతుంది.


లూయిస్ డాగ్యురే కనుగొన్న ఇది, బహిరంగంగా అందుబాటులో ఉన్న మొట్టమొదటి ఫోటోగ్రాఫిక్ ప్రక్రియ. డాగ్యురోటైప్ వెండి పూతతో కూడిన రాగి యొక్క పాలిష్ చేసిన షీట్లు, సుదీర్ఘ ఎక్స్‌పోజర్, అస్పష్టమైన చిత్రాన్ని ఉత్పత్తి చేయడానికి రసాయన చికిత్సను ఉపయోగించింది. ఈ ఆవిష్కరణను ప్రపంచంతో పంచుకోవడం మనకు తెలిసిన ఫోటోగ్రఫీ పరిణామానికి దారితీసింది.

ఫోటోగ్రఫీ అనే పదానికి అక్షరాలా 'కాంతితో గీయడం' అని అర్థం, ఇది గ్రీకు పదమైన ఫోటో నుండి ఉద్భవించింది, అంటే కాంతి గ్రాఫ్, అంటే గీయడం. ఫోటోగ్రఫీ అంటే కాంతికి సున్నితంగా ఉండే ఫిల్మ్‌పై లేదా డిజిటల్ ఫోటోగ్రఫీ విషయంలో డిజిటల్ ఎలక్ట్రానిక్ లేదా మాగ్నెటిక్ మెమరీ ద్వారా ఒక చిత్రాన్ని - ఛాయాచిత్రాన్ని - రికార్డ్ చేసే ప్రక్రియ.

అన్సెల్ ఆడమ్స్ ఒక అమెరికన్ ఫోటోగ్రాఫర్, అతను గ్రామీణ ప్రకృతి దృశ్యాల నలుపు మరియు తెలుపు ఫోటోగ్రఫీలో ప్రత్యేకత కలిగి ఉన్నాడు.

మే 17, 1861 న, స్కాటిష్ భౌతిక శాస్త్రవేత్త సర్ జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ రాయల్ ఇన్స్టిట్యూషన్‌లో మొట్టమొదటి రంగు ఛాయాచిత్రాన్ని ప్రదర్శించాడు. 19వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటిష్ వారు భారతదేశంలో ఫోటోగ్రఫీని ప్రవేశపెట్టారు. తొలి ఫోటోగ్రాఫర్లను బ్రిటిష్ ప్రభుత్వం సంస్థాన పాలకులు పోషించారు.

ఒక చిత్రాన్ని పునరుత్పత్తి చేయగల సంగ్రహించగల మొదటి పరికరాన్ని 1816లో జోసెఫ్ నిసెఫోర్ నీప్సే కనుగొన్నారు. దీనిని హీలియోగ్రాఫ్ అని పిలుస్తారు. 1826లో పారిస్‌లో చార్లెస్, విన్సెంట్ చెవాలియర్ తయారు చేసిన స్లైడింగ్ చెక్క పెట్టె కెమెరాను ఉపయోగించి నిసెఫోర్ నీప్సే కెమెరా ఇమేజ్ మొదటి శాశ్వత ఛాయాచిత్రాన్ని రూపొందించారు. 1816 నుండి కెమెరా అబ్స్క్యూరా చిత్రాలను పరిష్కరించే మార్గాలతో నీప్సే ప్రయోగాలు చేస్తున్నాడు. ఈ కెమెరా అధికారికంగా 1855 లో భారతదేశానికి చేరుకుంది.




జోసెఫ్ నిసెఫోర్ నిప్సే, లూయిస్ డాగ్యురేలను కెమెరాలతో ఫోటోగ్రఫీ ఆవిష్కర్తలుగా పరిగణిస్తారు. ప్రపంచ డిజిటల్ కెమెరా మార్కెట్‌లో ఐదు ఉత్తమ కెమెరా బ్రాండ్‌లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. కానన్, సోనీ, నికాన్, ఫుజిఫిల్మ్, పానసోనిక్‌లు. ఇటీవలి నివేదికల ప్రకారం సోనీ, కానన్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

ఫెలిక్స్ నాడార్ ప్రపంచంలోని మొట్టమొదటి సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్. మొట్టమొదటి విజయవంతమైన రోల్-ఫిల్మ్ హ్యాండ్ కెమెరా, కోడాక్, 1888 వేసవిలో ప్రారంభించారు. ఆవిష్కర్త జార్జ్ ఈస్ట్‌మన్. ఇంగ్లీష్ వృక్షశాస్త్రవేత్త, కలెక్టర్, ఫోటోగ్రాఫర్ అన్నా అట్కిన్స్ ఫోటోగ్రాఫిక్ చిత్రాలతో ఒక పుస్తకాన్ని చిత్రీకరించిన మొదటి వ్యక్తి.

ఫోటోగ్రఫీ మన అవగాహనలను ఎలా రూపొందిస్తుంది, వాస్తవాలను నమోదు చేస్తుంది. సాంస్కృతిక మార్పిడిని ఎలా పెంపొందిస్తుంది అనే దాని గురించి ప్రపంచవ్యాప్త జ్ఞాపకంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పనిచేస్తుంది. సామాజిక సమస్యలపై అవగాహన పెంచడం నుండి సహజ సౌందర్యం, మానవ సంబంధాలను జరుపుకోవడం వరకు, ఛాయాచిత్రాలు ఆలోచనను ప్రభావితం చేసే మార్పును ప్రేరేపించే శక్తిని కలిగి ఉంటాయి.

2025లో, ఫోటోగ్రఫీ కమ్యూనిటీలు, ప్రదర్శనలు సోషల్ మీడియా ప్రచారాలు ప్రజలు "వారికి ఇష్టమైన ఫోటో"ని ప్రపంచంతో పంచుకోవడానికి ప్రోత్సహిస్తున్నాయి. వేడుకలలో ఫోటోగ్రఫీ ప్రదర్శనలు, పోటీలు, వర్క్‌షాప్‌లు, ఆన్‌లైన్ ప్రచారాలు, ఫోటో నడకలు ఉన్నాయి. సోషల్ మీడియా కూడా పెద్ద పాత్ర పోషిస్తుంది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం దాని మూలాలను ఆగస్టు 19, 1839 నుండి గుర్తించింది, ఫ్రాన్స్ ప్రపంచానికి డాగ్యురోటైప్‌ను బహుమతిగా ఇచ్చింది - ఇది లూయిస్ డాగ్యురే కనుగొన్న ప్రారంభ ఫోటోగ్రాఫిక్ ప్రక్రియ. ఫోటోగ్రఫీ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన మొదటిసారిగా ఇది పరిగణించబడుతుంది.

# ఉమ్మడి విజయనగరం జిల్లాలో డిమాండ్స్ డే

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4న నిర్వహించిన జర్నలిస్టు డిమాండ్స్ డే కార్యక్రమం విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు 10 మండలాల్లోనూ, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు 6 మండలాల్లోనూ వినతి పత్రాలు అందజేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలత కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. మీడియాతో మాట్లాడిన అనంతరం కలెక్టర్ ఆడిటోరియంలోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టిలో పెడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అటు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఫెడరేషన్ కన్వీనర్ పట్నాయక్ నాయకత్వంలో జర్నలిస్టులు ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



































ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లాల మహాసభలను పూర్తిచేసే ప్రక్రియలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటుచేస్తున్నది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆ బాధ్యతను విశాఖపట్నం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్‌కు రాష్ట్ర కమిటీ అప్పగించింది. తొలుత జిల్లాలోని ముఖ్యులతో సమావేశం నిర్వహించి పట్నాయక్ కన్వీనర్‌గా అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేశారు. జిల్లాలోని నియోజకవర్గ కమిటీల ఏర్పాటును కన్వీనింగ్ కమిటీ బాధ్యతతో నిర్వర్తిస్తున్నది. అందులో భాగంగానే పార్వతీపురం నియోజకవర్గ కమిటీ ఏర్పాటైంది. సాలూరు నియోజకవర్గ కమిటీని విజయనగరం జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయుడు ఏర్పాటుచేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కమిటీల ఏర్పాటుతో జిల్లా మహాసభకు రంగం సిద్ధమైంది.

# కురుపాం ఫెడరేషన్ కమిటీ ఎన్నిక





పార్వతీపురం జిల్లా కురుపాం నియోజకవర్గ ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సమావేశం ఆగస్టు 21వ తేదీ స్నేహ కళా సాహితీ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి కన్వీనర్ డి రవికుమార్ అధ్యక్షత వహించారు. రాంబాబు పర్యవేక్షకులుగా హాజరయ్యారు. సమావేశం సందర్భంగా ఫెడరేషన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, సంఘటితం కావలసిన అవసరం గురించి చర్చించారు. అనంతరం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**కమిటీ ఎన్నిక**

ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా బి. సురేష్ ఉ ~~పాధ్యక్షులుగా తిరుపతిరావు, పైల కొండలరావు కార్యదర్శిగా టీ~~ వినోద్, సహాయ కార్యదర్శిగా సి అనిల్ కుమార్, కోశాధికారిగా ఆర్ పాండురంగ నాయుడు కార్యవర్గ సభ్యులుగా జే మణి భూషణరావు, పల్లి కొండయ్య, కిశోర గణపతి, ప్రసన్న కుమార్, ఎం రంగనాథ్, కే రాజా, సిహెచ్ చంద్రమౌళి ఎన్నికయ్యారు. న్యాయ సలహాదారులుగా బరాటం చంద్రమౌళీశ్వర రావు నియమితులయ్యారు.



# పాలకొండ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

పార్వతీపురం జిల్లా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం పాలకొండలో ఆగస్టు 23వ తేదీ జరిగింది రాష్ట్ర నాయకులు డి రవికుమార్, రాంబాబులు హాజరయ్యారు. పార్వతీపురం జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పట్నాయక్, పాలకొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వి సత్యనారాయణ సమక్షంలో ఫెడరేషన్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ పరిధిలో జర్నలిస్టులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశానికి హాజరైన వక్తలు స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు మరింత సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**కమిటీ ఎన్నిక**

పాలకొండ నియోజకవర్గ ఫెడరేషన్ అధ్యక్షులుగా జొన్నలగడ్డ కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆర్ సత్యనారాయణ, ఏ శంకర్రావు కార్యదర్శిగా మండల గణేష్ బాబు, సంయుక్త కార్యదర్శిగా బొత్స సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పడాల వైకుంఠరావులు ఎన్నికయ్యారు.





# ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు రాయితీ

చిత్తూరు, ఆగస్టు 4 : యూనియన్లకు అతీతంగా అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టు పిల్లలందరికీ ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు రాయితీ వర్తిస్తుందని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. జర్నలిస్ట్ డిమాండ్ డే ను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 4న స్థానిక గాంధీ విగ్రహం ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు బీ ప్రకాష్ కలెక్టర్‌తో మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని ఒక జర్నలిస్ట్ యూనియన్ సభ్యుల పిల్లలకు మాత్రమే ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతోందన్నారు. అన్ని యూనియన్ల సభ్యుల పిల్లలకు రాయితీ వర్తించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అదే విధంగా అర్హులైన ప్రతి ఒక జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ అందేలా చూడాలని, 3 సెంట్ల మేర ఇళ్ల స్థలాలను కేటాయించాలని, జర్నలిస్టులపై దాడులను నివారించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, వృద్ధ జర్నలిస్టుల కోసం ఆశ్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్లతో నిమిత్తం లేకుండా అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలందరికీ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ వర్తిస్తుందని, జర్నలిస్టులపై దాడులు చేసే వారి వివరాలను పోలీస్ ఎఫ్ఐఆర్‌తో సహా తనకు అందజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. అదేవిధంగా చిత్తూరు నగరంలో పనిచేస్తున్న ఇల్లు లేని జర్నలిస్టులు వివరాలను తనకు అందజేస్తే తప్పకుండా వారికి ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా ధర్నా కార్యక్రమంతో పాటు, కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి పట్నం కృపానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి యాదవేంద్రరెడ్డి, ప్రచార కార్యదర్శి దినేష్ ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( ఏపీ బిజెఏ ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్ర, నీరజాక్షులు, ఉపాధ్యక్షులు కమలాపతిరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ కేశవులు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శులు కుభేంద్రన్, తులసిరెడ్డి, సురేందర్రెడ్డి, సత్యంప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేడియో విశ్రాంత వ్యాఖ్యాత రామస్వామి మృతి

ఆకాశవాణి విజయవాడ వరంగల్ హైదరాబాద్ కేంద్రాల్లో వ్యవసాయ విభాగంలో పనిచేసిన దేవరకొండ రామస్వామి వృద్ధాప్యం అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో మృతి చెందారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన రామస్వామి 1937లో జన్మించారు. వ్యవసాయ శాఖలో ఫామ్ రేడియో ఆఫీసర్‌గా పని చేసిన తర్వాత ప్రత్యేక శిక్షణ పొంది 1971లో ఆకాశవాణిలో చేరారు. వృత్తిరీత్యా హైదరాబాదులో స్థిరపడిన రామస్వామి గ్రామాలకు వెళ్లి నేరుగా రైతులతో కలిసి వారి సమస్యలను రికార్డు చేసి తన కార్యక్రమాల ద్వారా ప్రసారం చేసి పేరు పొందారు. 1995లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతికి ఆకాశవాణి దూరదర్శన్ ప్రోగ్రామ్స్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



## గుంటూరు జిల్లా విద్యాశాఖ ఆధికారికి చిరు సత్కారం

సామాజిక శ్రేయస్సు కాంక్షిస్తూ ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టు పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు వారికి తోడ్పాటు అందించే విధంగా స్కూలు

గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీ కి సంబంధించి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ అందించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖల తరపున గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సువర్ణ బాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఫీజు లో 50 శాతం రాయితీ కల్పించడం అభినందనీయమని అన్నారు. దీనికి సహకరించిన జిల్లా కలెక్టర్ ఇతర జిల్లా అధికారులకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి పట్నాల సాయికుమార్ మహేష్ వరదల, ఎపిబిజెఎ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బోస్క సువర్ణ బాబు, కార్యదర్శి కేశంశెట్టి శ్రీనివాస, బ్రహ్మం రవి, రాజేష్, నవీన్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో మీడియాకు ప్రెస్ స్టిక్కర్లు



తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అభ్యర్థన మేరకు తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలపై, క్యూఆర్ కోడ్ కలిగిన ప్రత్యేక ప్రెస్ స్టిక్కర్లు మీడియా ప్రతినిధులకు అందజేయడం జరిగింది.

ఈ స్టిక్కర్లను స్కాన్ చేస్తే, పాత్రికేయుల పేరు, వారు పనిచేస్తున్న మీడియా సంస్థ పేరు, డిజిగ్నేషన్, కలెక్టర్ ఇచ్చిన గుర్తింపు (అక్రిడేషన్) నంబర్ వంటి వివరాలు కనిపిస్తాయని అధికారులు తెలిపారు. ఈ ఏర్పాటుతో నకిలీగా ప్రెస్ అంటూ తిరుగుతున్నవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు.

ప్రెస్ స్టిక్కర్లు పోలీసుల అనుమతి లేకుండా ఎవరైనా తయారు చేస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ, నిజమైన విలేకరుల హక్కులను కాపాడేలా జిల్లా ఎస్పీ చేసిన ఈ చర్య అభినందనీయమన్నారు.



# విశాఖలో జర్నలిస్టుల వినాయక చవితి వేడుకలు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఈనెల 26న మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఈ మేరకు ఆగస్టు 21న విశాఖపట్నంలోని అక్కయ్యపాలెంలో ఒక ప్రయివేట్ హొటల్లో ఆయా సంఘాల సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వినాయక చవితి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నిరంతరం సమాజాభివృద్ధి కోసం పాటు పడుతున్న జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ఆయా పండుగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగానే 26న ఆశీలమెట్ట వేమన మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 600 మంది జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహం, వినాయక వ్రతకల్పం, పూల, పండ్ల మొక్కలను అందజేయనున్నట్లు చెప్పారు. కావున జర్నలిస్టులు ఆయా కార్యక్రమంలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించాలని వీరు కోరారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తాము చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే అక్రిడేషన్లు కూడా అర్హులైన వారందరికి అందజేసే విధంగా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు దశల వారీగా వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కె.మధన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి..శివ ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులు మళ్ళ దేవ త్రినాధ్, డిపి నాయుడు, కె బాబురావు, అప్పలనాయుడు స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీ చక్రపాణి, పీ వెంకట రెడ్డి,కోశాధికారి కే వీ శర్మ,సంయుక్త కార్యదర్శులు బీ ప్రసాద్, రాజశేఖర్,కార్యవర్గసభ్యుడు అరుణ్ భాస్కర్, రెడ్డి సాయితో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# డాక్టర్ పిజె సుధాకర్ మృతి

కేంద్ర సమాచార ప్రసారాల శాఖలో అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ పి జే సుధాకర్ అనారోగ్యంతో విశాఖపట్నంలో ఆగస్టు ఆరవ తేదీ మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విశాఖ జిల్లా చిన్న ముషిడివాడలోని సోదరుడి గృహంలో తుది శ్వాస విడిచారు. పెందుర్తి మండలం పెదగాడిలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన సుధాకర్ విద్యావేత్తగా, పరిశోధకుడుగా వినుతికెక్కారు. ఆయన కేంద్ర సమాచార ప్రసారాల శాఖలో అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. తన జీవితంలో సుధాకర్ 110 డిగ్రీలు, పదుల సంఖ్యలో పీజీలు పూర్తి చేశారు. పిహెచ్‌డి కూడా చేశారు. శతాధిక డిగ్రీలు పూర్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సాధించారు. ఉద్యోగ విరమణ అనంతరం చినముషిడివాడలోని సోదరుని వద్దే ఉంటున్నాడు. ఆచార్య సుధాకర్ మృతి పట్ల ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖపట్నం జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి నారాయణ, జి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

# సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఆలం మృతి

సియాసత్ ఉర్దూ దినపత్రికలో పనిచేస్తున్న పరిగికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఆలం మృతి చెందారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణానికి చెందిన ఎండి ఆలం సియాసత్ విలేఖరిగా పనిచేస్తున్నారు. ఆయన గత నలభై యేళ్లుగా వివిధ దినపత్రికల్లో పనిచేశారు. ఆలం మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎండి రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఇండియన్స్ డే ఎడిటర్ గోపీనాథ్ మృతి



చిత్తూరు నుంచి ప్రచురితమవుతున్న ఇండియన్స్ డే పత్రిక సంపాదకుడు గోపీనాథ్ ఆగస్టు 15న చనిపోయారు. అనారోగ్యం పాలయిన ఆయన వైద్యచికిత్స పొందుతూ మరణించారు. చిత్తూరు జిల్లా ఫెడరేషన్‌లో సభ్యుడుగా చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రకాష్, సలీంలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సాక్షి చీరాల విలేఖరి మురళి ఆకస్మిక మృతి



సాక్షి దినపత్రిక బాపట్ల జిల్లా చీరాల విలేకరి కడియం మురళి మూర్తి చెందారు. కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజుల క్రితం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్యం విషమించటంతో ఆయన మృతి చెందారు. సుదీర్ఘకాలం పాటు జర్నలిస్టుగా ఆయన పనిచేశారు. ఆయన మృతి చెందేనాటికి సాక్షి దినపత్రిక చీరాల ఆర్‌సి ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మురళి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా ఫెడరేషన్ నాయకులు జయప్రకాష్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


అన్నమయ్య


అనంతపురం



చిత్తూరు


కడప



కర్నూలు


నంద్యాల


సత్యసాయి


తిరుపతి



బాపట్ల


గుంటూరు


నెల్లూరు


ఎన్టీఆర్


పల్నాడు


ప్రకాశం

# సుపరిపాలనకు ఏడాది

## పేదల సేవలో...

రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

దీపం-2 పథకం ఏడాదికి 3 వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు రూ.4000 పింఛను లబ్ధిదారులకు ఏటా రూ.34,000 కోట్లు పంపిణీ

'మత్స్యకారుల సేవలో' పథకం కింద వేట నిషేధకాల భృతి రూ.20 వేలకు పెంపు

పి-4 కార్యక్రమంతో పేదరికం నుండి విముక్తి

- ఒకటి నుండి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000 సాయం
- ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ వర్తింపు
- తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లు జమ
- రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి

## యువత కోసం పరిశ్రమలు - ఉద్యోగాలు

రూ.9.34 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ

మొత్తం 8,50,000 పారిశ్రామిక ఉద్యోగావకాశాలు




## రైతుకోసం

పోలవరం, హంద్రీ-నీవా సహా అన్ని ప్రాజెక్టుల పనులపై ప్రత్యేక దృష్టి

90% సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్

జూన్ నెలలోనే అన్నదాత పథకం ప్రారంభం

## సామాజిక సంక్షేమం

బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లు ఏటా రూ.1000 కోట్లతో ఆదరణ-3 పథకం

30 ఏళ్ళ కల... ఏపీలో ఎస్సీ వర్గీకరణ అమలు

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం

# సుపరిపాలనలో తొలి అడుగు

4.1

## ఉత్తరాంధ్ర నుండి రాయలసీమ వరకు అభివృద్ధి

| | | | |
|---|---|---|---|
| Amaravati<br>రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం | జెట్ స్పీడ్‌తో భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు | మల్లవల్లిలో అశోక్ లే ల్యాండ్ పరిశ్రమ ప్రారంభం | Bharat Petroleum<br>బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ & పెట్రో కెమికల్ కాంప్లెక్స్ |
| విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ | కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ | కడప జిల్లాలో కొప్పర్తి పారిశ్రామిక నోడ్ | VIZAG STEEL Pride of Steel<br>విశాఖ స్టీల్‌కు కేంద్రం రూ.11,400 కోట్ల రివైవల్ ప్యాకేజీ |

## సంవత్సరంలో రాష్ట్రానికి తెచ్చిన కంపెనీలు

Google, TCS TATA CONSULTANCY SERVICES, ArcelorMittal, NVIDIA, LG, Reliance Industries Limited, XLRI, भारत इलेक्ट्रॉनिक्स BHARAT ELECTRONICS, DAIKIN, HCL, एनटीपीसी NTPC, TATA POWER, SUZLON POWERING A GREENER TOMORROW, LuLu

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికి ప్రగతిని, సంక్షేమాన్ని అందించాలని... అలాగే ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ప్రతి జిల్లాలో సమగ్రాభివృద్ధిని సాధించి... రాష్ట్రాన్ని దేశంలో కెల్లా ప్రగతి పూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పం. అందుకోసం ప్రజల ఆశీర్వాదం, మరిన్ని పథకాలు, ప్రణాళికలతో నిరంతరం శ్రమించేందుకు మీ మంచి ప్రభుత్వం కట్టుబడి ఉంది."

